క్లుప్తంగా

శ్రీశైలానికి డాక్టరేట్



కమలాపూర్ : మండలంలోని కానిపర్తి గ్రామానికి చెందిన పర్లపెల్లి శ్రీశైలం కాకతీయ యూనివర్సిటీ నుంచి తెలుగు విభాగంలో డాక్టరేట్ అందుకున్నాడు. ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 'నామని సుజనాదేవి రచనలు–అధ్యయనం' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకు శ్రీశైలంకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలంను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అభినందించారు.

టీకాలు వేయించాలి

ఆత్మకూరు : గ్రామాల్లో పాడి పశువులకు, దుక్కిటెడ్లు, మూడు నెలల వయస్సు పై బడిన దూడలకు గాలికుంటు వ్యాధి సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ధర్మానాయక్ తెలిపారు. మండలంలోని హౌజ్‌బుజుర్గు, కొత్తగట్టు గ్రామాల్లో బుధవారం టీకాలు వేయడం జరిగిందని వివరించారు. నేడు (గురువారం) నీరుకుళ్ల, కొత్తగట్టు గ్రామాల్లో టీకాలు వేయనున్నామని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు.

'భూభారతి' చట్టంపై అవగాహన సదస్సు

ఐనవోలు : తెలంగాణ ప్రభుత్వం ఇటీవల తెచ్చిన నూతన భూ భారతి రెవెన్యూ చట్టంపై అవగాహన సదస్సు మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నామని, రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని తహసీల్దార్ విక్రమ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఆర్డీఓ రాథోడ్ రమేష్‌లు సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు జరుగనుందని పేర్కొన్నారు.

పుష్పమ్మకు నివాళి

శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు తేనేటి రామకృష్ణారెడ్డి అమ్మమ్మ గంగుల పుష్పమ్మ బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాయరాకుల మొగిలి పుష్పమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పుష్పమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటికొండ రవికిరణ్, మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ, నాయకులు ఉప్పు రాజు, రమణారెడ్డి, రాజశేఖర్, రాకేష్ రెడ్డి ఉన్నారు.

పాత రేషన్‌కార్డుల్లో పేరు తొలగించుకోవాలి

శాయంపేట : కొత్తగా రేషన్‌కార్డు దరఖాస్తు చేసుకున్న వారు పాత రేషన్‌కార్డుల్లో పేరు తొలగించుకోవాలని తహసీల్దార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలకు వచ్చి లిస్ట్ ప్రకారం తిరుగుతున్నారు కానీ పాత కార్డులో డిలీట్ కాకుండా కొత్త కార్డు ఎంట్రీ తీసుకోవడం లేదని చాలా మంది కార్యదర్శులు చెబుతున్నారని తెలిపారు. పాత రేషన్‌కార్డులో పేరు డిలీట్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే తొలగిస్తున్నామని తెలిపారు.

భూమాత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సంపత్



వేలేరు : భూమాత రైతు సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని పీచర గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ జల్తారి సంపత్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సమ్మయ్య యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులను ఆదుకుంటాం



పరకాల: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి స్పష్టం చేశారు. పరకాల వ్యవసాయ మార్కెట్‌లో అకాల వర్షానికి కొట్టుకపోయిన, తడిచిన ధాన్యాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. తడిచిన ధాన్యాన్ని ఆరబోసి తర్వాత ప్రభుత్వం తప్పకుండా కొనుగోలు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

రోడ్ల మధ్యన స్తంభాలు

- వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



సాయి నగర్‌లో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

మండల కేంద్రంలోని పలు కాలనీల్లో రోడ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలతో కాలనీ వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు.మండల కేంద్రంలో ఎనిమిదేళ్ల క్రితం అంతర్గత రోడ్ల విస్తరణ పనులు చేపట్టి పలు కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించారు. ఆ సమయంలో రోడ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే రోడ్లు నిర్మించడంతో రోడ్ల విస్తరణ చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. రోడ్ల మధ్య విద్యుత్ స్తంభాలు ఉన్న కారణంగా అసలే ఇరుకుగా ఉన్న రోడ్లు మరింత ఇరుకుగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్, పంచాయతీరాజ్ శాఖ అధికారుల మధ్య సమన్వయం లేకనే ఈ దుస్థితి నెలకొందని ఆయా కాలనీలవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఇరు శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి సమస్య పరిష్కారానికి చొరవ చూపి రోడ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించాలని ఆయా కాలనీల వాసులు, వాహనదారులు కోరుతున్నారు.

- కమలాపూర్



ఎంబాల వాడలో..



కమలాపూర్ ఎస్సీ కాలనీలో రోడ్డు మధ్య ఉన్న విద్యుత్ స్తంభం

దామెరలో బ్యాంకు ఏర్పాటు చేయాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయ్‌చందర్ రెడ్డి

దామెర : మండల కేంద్రంలో బ్యాంకు శాఖను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దామెరను మండల కేంద్రంగా ఏర్పాటు చేసి తొమ్మిదేళ్లు పూర్తికావస్తున్నా బ్యాంకు లేకపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో కాకతీయ గ్రామీణ వికాస్ బ్యాంకు శాఖను నక్సలైట్లు పేల్చేసిన కారణంగా వరంగల్‌లోని పోచమ్మమైదాన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. బ్యాంకులేని కారణంగా దామెరతో పాటు ల్యాదెళ్ల, కోగిల్వాయి, వెంకటాపూర్, సింగరాజుపల్లి, ఒగ్లాపూర్ గ్రామాల ప్రజలు ప్రతి అవసరానికి నగరంలోని బ్యాంకుకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులు, మహిళా సంఘాల సభ్యులు, ఉద్యోగులు, పెన్షన్‌దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. దామెరలో పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం వంటి ప్రధాన కార్యాలయాలు ఉన్నప్పటికీ బ్యాంకు లేకపోవడంతో ఖాతాదారులు అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, మండ పార్టీ అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, బత్తుల సుమంత్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పాఠశాలకు ఆర్వో ప్లాంట్ బహూకరణ



స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్ అందుకున్న విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని కేంద్ర ప్రాథమిక పాఠశాలకు మెకీస్ కంపెనీ, హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఆర్వో ప్లాంట్, కూలింగ్ వాటర్ ఫ్రిజ్, కంప్యూటర్ బహూకరించి విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, స్టేషనరీ, స్నాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డీజీఎం మేదూరి శ్రీనివాస్, ప్లాంట్ మేనేజర్ సురేష్ చంద్, అడ్మినిస్ట్రేషన్ అధికారి పవన్, ఆపరేషన్ అధికారి వంశీ, సేఫ్టీ అధికారి మోహన్, పాఠశాల హెచ్‌ఎం అన్నమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

కమలాపూర్ : హసన్‌పర్తికి చెందిన దేవరకొండ సృజన్ పోక్సో కేసులో బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కమలాపూర్ సీఐ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం.. 2020లో కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన సృజన్ గత ఏడాది కాలంగా కోర్టుకు హాజరుకాకపోవడంతో సెషన్స్ కోర్టు జడ్జి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు తెలిపారు. దీంతో అతడిని బుధవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పాఠశాలను సందర్శించిన సీఎంఓ

శాయంపేట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలికల, బాలుర పాఠశాలలు, సాంఘీక సంక్షేమ పాఠశాలలో నిర్వహిస్తున్న సంగ్రహణాత్మక మూల్యాంకనం–2 పరీక్షలను బుధవారం జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ బద్దం సుదర్శన్‌రెడ్డి, ఎంఈఓ గడ్డం భిక్షపతి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులతో ముందస్తు బడిబాటలో భాగంగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఎంఈఓ భిక్షపతి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వచ్చే విధంగా అవగాహన కల్పించారు.



ఎస్సీ కాలనీలో బడిబాట నిర్వహిస్తున్న ఎంఈఓ భిక్షపతి

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



ఆయిల్ పామ్ చెట్లను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

వేలేరు : మండలంలోని గుండ్లసాగర్ గ్రామంలోని రైతు మంద సారంగపాణి వ్యవసాయ క్షేత్రంలో కేవన్ బయోసైన్స్ ఆధ్వర్యంలో మండలంలోని ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీత లక్ష్మీ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు రైతులకు ఎంతో లాభాదాయకమని అన్నారు. ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుచేస్తున్న రైతులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహాలను కూడా అందజేస్తుందని అన్నారు. సాగులో యాజమాన్య పద్ధతులు, చీడ పీడల నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఓ కవితరాణి, కేవన్ బయోసైన్స్ ఎండీ సుధారెడ్డి, సీఈఓ కుశాల్ రెడ్డి, ఉద్యానశాఖ డివిజన్ అధికారి సుష్మిత, సీనియర్ సైంటిస్ట్ సుధాకర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

వేలేరు : మండలంలోని మోడల్ గ్రామపంచాయతీ శాలపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఘన్‌పూర్ ఆర్డీఓ, ఇందిరమ్మ ఇళ్ల ప్రత్యేకాధికారి డీఎస్.వెంకన్న బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్లను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించుకోవాలని సూచించారు. త్వరలోనే మొదటి దశ బిల్లులు వస్తాయని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీఓ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు అశోక్ పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకన్న

ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎఫ్‌ఏలు

వేలేరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని ఎంపీడీఓ లక్ష్మీప్రసన్నకు ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు ఆకుల మల్లన్న ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పే స్కేల్ వర్తింపచేయాలని కోరారు. గతంలో తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు స్వామి, పరమేష్, రజనీ కాంత్, మిట్ట రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సన్నవడ్లకు మద్దతు ధర, బోనస్

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- నందనం సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు : తెలంగాణ ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి కనీస మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందజేస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తెలిపారు. బుధవారం మండలంలోని రాంనగర్ రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ప్రోత్సహించడానికి ఉచిత కరెంటు, రుణమాఫీ, రైతు భరోసా, రూ.500 బోనస్ లాంటి పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కేంద్రం ధాన్యం మద్దతు ధర రూ.3000 ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని దళారులతో మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తగినన్ని టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని సొసైటీ నిర్వాహకులను ఆదేశించారు. ఈ క్రమంలో రాంనగర్‌కు చెందిన పలువురు రైతులు తాలు పేరిట క్వింటాకు 6–10 కిలోల వరకు తరుగు తీస్తూ మోసం చేస్తున్నారని ఎమ్మెల్యేను నిలదీశారు. అదే విధంగా గత సీజన్‌లో విక్రయించిన ధాన్యానికి రవాణా డబ్బులు జమకాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మరికొందరు పలు సమస్యలను ఎమ్మెల్యే తీసుకొస్తున్న క్రమంలో సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడటంతో సొసైటీ, పోలీసు అధికారులు కలుగజేసుకోవడంతో సద్దుమణిగింది. అంతకు ముందు రైతులకు సొసైటీ ద్వారా మంజూరైన కర్షక మిత్ర రుణాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీఓ సునీల్ కుమార్, వర్ధన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాం నరసింహారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు సమ్మెట మహేందర్, ఇల్లందుల ఎలిషా, సొసైటీ డైరక్టర్లు, సీఈఓ సంపత్ తదితులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

శాయంపేట : మండల కేంద్రంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి సర్వేనంబర్ 545లో ప్రభుత్వ స్థలాన్ని కేంటాయించినందుకు బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చిత్రపటాలకు దళిత సంఘాల నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే సత్యనారాయణ రావు అంబేడ్కర్ భవనానికి స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు. గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినతిపత్రాలు పట్టించుకోలేదని తెలిపారు. అంబేడ్కర్ జయంతి రోజు అంబేడ్కర్ భవనాన్ని నిర్మించాలని ఎమ్మెల్యే దృష్టికి దళిత సంఘాల నాయకులు తీసుకెళ్లగా వెంటనే స్పందించి పది రోజుల్లో శంకుస్థాపన చేస్తానని చెప్పారని చెప్పిన విధంగానే స్థలాన్ని కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు అంకేశ్వరపు ఐలయ్య, అరికిల్ల దేవ య్య, మారెపల్లి క్రాంతికుమార్, మొగ్గం సుమన్, మారెపల్లి విజయ్, రాజు, బలిజె వేణు, రేణికుంట్ల సదయ్య, మస్కే సదయ్య, బీసీ నాయకుడు దామెరకొండ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సత్యనారాయణరావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దళిత సంఘం నాయకులు

తల్లీబిడ్డలు పోషకాహారం తీసుకోవాలి

- ఐసీడీఎస్ సీడీపీఓ స్వాతి



సింగరాజుపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

దామెర : తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ స్వాతి అన్నారు. మండలంలోని సింగరాజుపల్లిలో పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల్లో పుష్కలంగా పోషకాలు ఉంటాయని, గర్భిణులు, బాలింతలు అధికంగా తీసుకోవాలని సూచించారు. ఎత్తుకు తగిన బరువు ఉండే విధంగా బాలబాలికల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని వెల్లడించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆరోగ్య గ్రామంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ భిక్షపతి, అంగన్‌వాడీ సిబ్బంది వాణి, తల్లులు, పిల్లలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

వరంగల్ జిల్లాలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పలువురు రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అకాల వర్షానికి వరిపంట నేలవాలింది. మొక్కజొన్న కంకులు, మామిడి కాయలు నేలరాలాయి. చాలా చోట్ల పంటలు దెబ్బ తిన్నాయి. చేతికొచ్చిన పంట నేలరాలడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గాలికి ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి. రూ. లక్షల్లో పంట పోయినందున ప్రభుత్వం పంటలను సర్వే చేయించి నష్టపరిహారం చెల్లించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

- సాక్షి, నెట్‌వర్క్



పరకాల : వ్యవసాయ మార్కెట్‌లో కొట్టుకుపోయిన ధాన్యపు రాశులు



నడికూడ: నేలకొరిగిన మొక్కజొన్న పంట



పరకాల: నేలవాలిన వరి



శాయంపేట: విరిగి పడిన విద్యుత్ స్తంభం



కమలాపూర్: ఎగిరిపోయిన రేకుల షెడ్డు పైకప్పు రేకులు



శాయంపేట : మైలారంలో నేలవాలిన వరి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ అన్వేశ్



శాయంపేట : ఇంటిపై రేకులు ఎగిరి పోవడంతో ఆదుకోవాలని వేడుకుంటున్న బాధితులు